ఆంధ్రప్రభ
శనివారం
28-10-2023
స్మార్ట్ ఎడిషన్
3
ఆంధ్రప్రభ

# అదంతా నా వల్లే!

## 1995లో నేనే మంత్రి పదవి ఇప్పించా..

- అప్పట్లో మంత్రి అయ్యారంటే నావల్లే
- పాలేరులో పార్టీ శ్రేయస్సు కోసమే పోటీ చేశా
- తుమ్మల నాగేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు

ఖమ్మం జిల్లా పాలేరులో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ సభలో సీఎం కేసీఆర్.. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరావుపై విమర్శలు గుప్పించారు. దీనిపై తుమ్మల నాగేశ్వరరావు కూడా అదే రేంజ్‌లో స్పందించారు. ఖమ్మంలోని పలు డివిజన్లలో జరిగిన ఆత్మీయ సమావేశాల్లో తుమ్మల మాట్లాడారు. సీఎం కేసీఆర్ తన స్థాయిని మరిచి పచ్చి అబద్దాలు మాట్లాడారని మండిపడ్డారు. కేసీఆర్ తనకు మంత్రి పదవి ఇప్పించారని చెబుతున్నారని.. కానీ, 1995లో ఆయనకు తానే మంత్రి పదవి ఇప్పించానని తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేశారు. ఈ విషయం ఆయన మర్చిపోయారని అన్నారు. గోదావరి జలాలను పాలేరుకు తెప్పించి, 10 లక్షల ఎకరాలకు నీరందించాలన్నదే తన కోరిక అని వ్యాఖ్యానించారు. అందుకే తాను కాంగ్రెస్ నుంచి ఎన్నికల్లో బరిలో దిగుతున్నానని చెప్పారు.

**తన ఓటమికి కారణం కేసీఆర్‌కు తెలుసు..**

2018లో జరిగిన ఎన్నికల్లో పాలేరులో తాను ఓడిపోయానని, కానీ దానికి కారణం ఎవరో సీఎం కేసీఆర్ అంతరాత్మకు తెలుసని తుమ్మల అన్నారు. పువ్వాడ అజయ్‌కు మంత్రి పదవి ఇచ్చేందుకు కేటీఆర్ తన ప్రత్యర్థికి డబ్బులు ఇచ్చారని, తనను ఓడించారని ఆరోపించారు. పాలేరుకు వచ్చిన ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ నుంచి ఎవరూ ముందుకు రాలేదని తుమ్మల అన్నారు. అయితే పార్టీ శ్రేయస్సు కోసమే తాను పాలేరులో పోటీ చేసేందుకు అంగీకరించానని గుర్తు చేశారు. ఈ విషయాలు మర్చిపోయి కేసీఆర్ ఇప్పుడు దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది చాలా దురదృష్టకరం అని అన్నారు.





# టెంపరేచర్లు తగ్గినయ్

## చల్లటి గాలులు వస్తున్నయ్

- హైదరాబాద్, రంగారెడ్డిలో గజ గజ
- 11 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- తెలంగాణను వణికిస్తోన్న చలి..
- మూడు రోజులపాటు వణుకుడే
- పిల్లలు, వృద్ధులు జాగ్రత్త అంటున్న డాక్టర్లు

తెలంగాణలో చలి తీవ్రత పెరిగింది. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. శుక్రవారం కనిష్ఠంగా 11.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ మేరకు హైదరాబాద్, మల్కాజిగిరిలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో మూడురోజులు చలి తీవ్రత కొనసాగుతుందని వాతావరణశాఖ పేర్కొంది.

బంగాళాఖాతంలో రెండు ఆవర్తనాలు ఏర్పడగా ఇందులో ఒకటి నైరుతి దిశలో తమిళనాడుకు దగ్గరలో ఉంది. భూమికి 1.5 కిలోమీటర్ల నుంచి 3.1కిలోమీటర్ల వరకు ఇది ఆవర్తనమై ఉంది. రెండో ఆవర్తనం తమిళనాడుకు దక్షిణంగా, సముద్రమట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో ఏర్పడింది. అయితే.. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

**శనివారం తెల్లవారుజాము నుంచి చలి తీవ్రత..**

శనివారం తెల్లవారు జామున రికార్డు స్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో 11.0 డిగ్రీల సెల్సియస్, మౌలాలిలో 11.2, బీహెచ్ఈఎల్‌లో 12.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణశాఖ వెల్లడించింది. ఇప్పటికే చలి కాలం ప్రారంభం కాగా, నాలుగైదు రోజుల నుంచే రాష్ట్రంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు కాస్త తగ్గినప్పటికీ.. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగానే ఉంటోంది. అయితే, చలి తీవ్రత మరో రెండు నెలలు కొనసాగే అవకాశాలున్నాయి.

## అవీ.. ఇవీ..



### ట్విట్టర్ (X)లో రెండు కొత్త ప్రీమియం ప్లాన్‌లు

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ (X).. రెండు కొత్త ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌లను తీసుకొచ్చింది. రూ.13,600తో ఏడాది సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను నిర్ణయించింది. అలాగే రూ.1,300తో మంత్లీ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ అందుబాటులో ఉంది. ఈ రెండు ప్రీమియం ప్లాన్‌ల ద్వారా.. ట్విట్టర్‌లో యాడ్ ఫ్రీ సదుపాయం పొందవచ్చు. పోస్టులకు ఎడిట్, వీడియో డౌన్లోడ్ ఫీచర్లు ఉంటాయి.



### ఆలస్యంగా ట్రైన్ .. ₹60 వేల ఫైన్ వేసిన కోర్టు

భారత రైల్వే శాఖ నుంచి నష్టపరిహారాన్ని పొంది వార్తల్లో నిలిచాడో వ్యక్తి. కేరళ రాష్ట్రం ఎర్నాకులంకు చెందిన కార్తిక్ మోహన్ చెన్నైకి వెళ్లే అలప్పుజా-చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలులో టికెట్ బుక్ చేసుకున్నాడు. ట్రైన్ 13 గంటలు ఆలస్యంగా వచ్చింది. ఆ ప్రయాణికుడు ట్రైన్ ఆలస్యం వల్ల తనకు జరిగిన నష్టంపై కోర్టును ఆశ్రయించాడు. ఆర్థిక నష్టం అంచనా చేసిన కోర్టు.. ఈ మేరకు రైల్వేశాఖకు రూ.60 వేల ఫైన్ వేస్తున్నట్లు తీర్పునిచ్చింది.



# కాంగ్రెస్.. రీ ఫ్రెష్!

## కొత్తవారికే ప్రాధాన్యం

- అభ్యర్థుల్లో కదనోత్సాహం
- కొత్తోళ్లకే ప్రాధాన్యం
- గెలుపే లక్ష్యంగా ఎంపిక
- సంప్రదాయానికీ భిన్నం..
- బల నిరూపణకు సై

**హైదరాబాద్, ఆంధ్రప్రభ బ్యూరో :**

కాంగ్రెస్ మలివిడత జాబితా తో తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇన్నిరోజులూ అటు అధికార బీఆర్ఎస్.. ఇటు బీజేపీ ఆదరించకపోవడం, తగిన ప్రాధాన్యత ఇవ్వట్లేదని వందలాది నేతలు, లక్షలాది కార్యకర్తలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇందులో ముఖ్య నేతలు, కీలక నేతలు.. ద్వితియ శ్రేణి నేతలూ ఉన్నారు. వారందర్నీ అక్కున్న చేర్చుకున్న కాంగ్రెస్ ఇటీవల పార్టీలో చేరిన ముఖ్యనేతలకు దాదాపు టికెట్లు ఇచ్చింది. పార్టీలో చేరగానే ఆ నేతలకు ప్రజల్లో ఉన్న ఆదరణ, ఎవర్ని ఎక్కడ్నుంచి బరిలోకి దింపితే గెలిచే అవకాశాలు ఉన్నాయని ఇవన్నీ సర్వేలు చేయించి మరీ టికెట్లు కేటాయించడం జరిగింది. కాంగ్రెస్ కేటాయించిన టికెట్లను చూసిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీల అధిష్టానాలు ఒకింత కంగుతిన్న పరిస్థితి.

టికెట్లు ఇవ్వడమే కాదు.. కచ్చితంగా గెలిపించుకుంటామనే ధీమాతో కాంగ్రెస్ ఉంది. వాస్తవానికి మొదట్నుంచీ కాంగ్రెస్ పార్టీలో చేరిన నేతలకు కచ్చితంగా ప్రాధాన్యం కల్పించాలనే భావనలోనే హైకమాండ్ ఉంది. మొదటి జాబితాలో కొత్త వారికి మొత్తం 12 సీట్లు వారికి దక్కగా.. మైనంపల్లి హన్మంతరావు, ఆయన కుమారుడు రోహిత్‌రావు, నిర్మల్ నియోజకవర్గానికి చెందిన కూచాడి శ్రీహరి రావు, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇటీవలి కాలంలో కాంగ్రెస్‌లో చేరారు. వెలమ సామాజిక వర్గానికి చెందిన ఈ నలుగురికీ సీట్లు దక్కాయి. ఇటీవల కాంగ్రెస్ కండువా కప్పుకొన్న వినయ్ కుమార్ రెడ్డి, సునీల్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూసుకుళ్ల రాజేష్‌రెడ్డి, సరిత, ఎ చంద్రశేఖర్, వేముల వీరేశం, కోట నీలిమలకు కూడా అభ్యర్థిత్వం లభించింది.

**రెండో జాబితాలో 15 మంది కొత్తవారికి చోటు**

ఇప్పటి వరకూ మొత్తం 100 స్థానాలకు అభ్యర్థులకు కేటాయించిన కాంగ్రెస్.. ఇందులో 27 మంది కొత్త అభ్యర్థులే కావడం విశేషం. అయితే.. కొత్తవారికి టికెట్లు కేటాయించడంతో ఇప్పటి వరకూ పార్టీలో పాతుకుపోయిన.. ఏళ్ల తరబడి పార్టీకి సేవలు చేస్తున్న వారికి.. యువనేతలకు టికెట్లు దక్కలేదని ఆరోపణలూ లేకపోలేదు.


### కొత్త వాళ్ళకే అగ్ర తాంబూలం ..

| | |
|---|---|
| ఆదిలాబాద్ | - కంది శ్రీనివాస్ రెడ్డి |
| ఆసిఫాబాద్ | - శ్యామ్ నాయక్ |
| ముధోల్ | - బి.నారాయణరావు |
| కూకట్ పల్లి | - బండి రమేష్ |
| శేరిలింగంపల్లి | - జగదీశ్వర్ గౌడ్ |
| తాండూర్ | - మనోహర్ రెడ్డి |
| కంటోన్మెంట్ | - వెన్నెల |
| మహబూబ్ నగర్ | - ఎ.శ్రీనివాస్ రెడ్డి |
| మునుగోడు | - రాజగోపాల్ రెడ్డి |
| పాలకుర్తి | - యశస్విని |
| పరకాల | - రేవూరి ప్రకాష్ రెడ్డి |
| వర్ధన్నపేట | - కేఆర్. నాగరాజు |
| ఖమ్మం | - టి. నాగేశ్వర్ రావు |
| పాలేరు | - పి. శ్రీనివాస్ రెడ్డి |
| పినపాక | - పి. వెంకటేశ్వర్లు |

### మొత్తం 100 స్థానాల్లో..

| | | |
|---|---|---|
| రెడ్డి సామాజిక వర్గానికి | - | 37 స్థానాలు |
| బిసిలకు | - | 15 స్థానాలు |
| వెలమలకు | - | 08 స్థానాలు |
| కమ్మలకు | - | 03 స్థానాలు |
| బ్రాహ్మణులకు | - | 02 స్థానాలు |
| మైనారిటీలకు | - | 04 స్థానాలు |
| ఎస్.సీ స్థానాలు | - | 19 స్థానాలు |
| ఎస్టీ స్థానాలు | - | 12 స్థానాలు |





# హెచ్‌సీఏలో.. గోల్‌మాల్

## టెండర్ల పేరుతో థర్డ్ పార్టీకి ఫండ్స్

- అజారుద్దీన్ అక్రమాలకు పాల్పడ్డట్టు కేసు
- ముందస్తు బెయిల్‌కోసం అజార్ పిటిషన్

హెచ్ సీఏ మాజీ అధ్యక్షుడు అజారుద్దీన్ మల్కాజ్గిరి కోర్టును ఆశ్రయించారు. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోర్టుని కోరారు. హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్) అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కోట్ల రూపాయల నిధులను గోల్ల్ చేశారని అజారుద్దీన్ మీద కేసు నమోదైంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అజారుద్దీన్ టెండర్ల పేరుతో థర్డ్ పార్టీకి నిధులు కట్టబెట్టారని కేసు నమోదు అయింది. అజారుద్దీన్ మీద జస్టిస్ లావ్ నాగేశ్వరరావు కమిటీ నాలుగు కేసులు పెట్టింది.

**ఫారెన్సిక్ నివేదికలో నిధుల స్వాహాపై ఆధారాలు..**

హెచ్‌సీఏలో 2020 నుంచి 2023 వరకు కోట్ల రూపాయలు నిధులను స్వాహా చేశారని ఫారెన్సిక్ నివేదిక తెలిపింది. జస్టిస్ లావు నాగేశ్వరరావు కమిటీ ఆగస్టు 10వ తేదీన హెచ్సీఏ నిధుల గోల్ మాల్ ఆడిట్ నిర్వహించింది. ఈ ఆడిట్‌లో క్రికెట్ బాల్స్ కొనుగోలు వ్యవహారంలో భారీగా అవకతవకలు జరిగినట్లుగా గుర్తించింది. 392 రూపాయల ఒక్కో బాల్‌ని రూ.1400 వర్క్ ఆర్డర్ చేసినట్లు వెలుగు చూసింది.

**అసోసియేషన్‌కు ₹57 లక్షల నష్టం..**

క్రికెట్ బాల్స్ కొనుగోలు వ్యవహారంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు 57 లక్షల రూపాయల నష్టం వాటిలినట్లుగా లావు నాగేశ్వరరావు కమిటీ తన ఆడిట్‌లో తేల్చింది. దీంతో పాటు బకెట్ కుర్చీల కొనుగోలులో కూడా ఇలాంటి అవకతవకలే జరిగాయి. ఈ కొనుగోలులో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కి రూ.43లక్షలు నష్టం కలిగినట్లు తమ రిపోర్టులో కమిటీ పేర్కొంది.

**ఫైర్ ఫైటింగ్ పరికరాల కొనుగోలులోనూ..**

మరో అవకతవక ఫైర్ ఫైటింగ్ పరికరాల కొనుగోలు. ఈ పరికరాల కొనుగోలు వ్యవహారంలో రూ.1.50 కోట్లు హెచ్ సీఏకు నష్టం వచ్చింది. ఇక జిమ్ పరికరాల పేరుతో రూ.1.53 కోట్లు నష్టం చవిచూసింది. ఇలా.. ఉప్పల్ పోలీసులు అజారుద్దీన్ మీద నాలుగు కేసులు నమోదు చేశారు. కేసులు నమోదైనప్పటి నుంచి అజారుద్దీన్ అజ్ఞాతంలోనే ఉన్నారు. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ మల్కాజ్ గిరీ కోర్టులో అజారుద్దీన్ పిటిషన్ వేశారు. అజారుద్దీన్ వేసిన ఈ బెయిల్ పిటిషన్ మీద మల్కాజిగిరి కోర్టు నవంబర్ ఒకటవ తేదీన విచారణ చేపట్టనుంది.

